Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in
సామాజికం.. ప్రజల పక్షం...

నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...
TMEDIA
11వ వార్షికోత్సవం
2016 - 2026
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

బుధవారం ఆగస్టు 05, 2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

# అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ దాడి



● చర్చలపై ట్రంప్ వ్యాఖ్యలు చేసిన కొద్ది గంటలకే ● ఒమాన్ సమీపంలో వాణిజ్య నౌకపై దాడి



**టీ మీడియా, ఆగస్టు 4, ఢిల్లీ బ్యూరో :** అమెరికా– ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయి. కువైట్?లోని అమెరికా సైనిక స్థావరాన్ని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్? కార్ప్స్? (ఐఆర్?జీసీ) డ్రోన్లతో దాడి చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. కనీసం మూడు డ్రోన్లతో ఈ దాడి జరిగినట్లు సమాచారం. కువైట్‌కు ఆనుకుని ఉన్న ఇరాక్‌లోని బస్రా ప్రాంతంలో కూడా భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇదే సమయంలో కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించినట్లు ప్రాంతీయ వార్తా సంస్థలు వెల్లడించాయి. అయితే ఈ ఘటనలకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికాలేదు. అయితే ఈ పరిణామం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని ప్రకటించిన మరుసటి రోజే ఈ దాడులు జరగడం గమనార్హం.

### ఒమాన్ సమీపంలో వాణిజ్య నౌకపై దాడి

మరోవైపు ఒమాన్‌లోని అల్ ఖసబ్‌కు ఈశాన్య దిశగా సుమారు 20 నాటికల్ మైళ్ల దూరంలో ప్రయాణిస్తున్న ఓ సరుకు రవాణా నౌక గుర్తుతెలియని వస్తువు ఒకటి ఢీకొట్టినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యూకేఎంటీఓ) తెలిపింది. నౌక నుంచి వీహెచ్‌ఎఫ్ ఛానల్–16 ద్వారా అత్యవసర సమాచారాన్ని అందించినట్లు వెల్లడించింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, ఆ ప్రాంతంలో ప్రయాణించే అన్ని నౌకలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే సమాచారమివ్వాలని యూకేఎంటీఓ సూచించింది.

### 'ఇది చివరి అవకాశం'

ఈ పరిణామాలకు ఒక రోజు ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్? ఒప్పందం చేసుకోవడానికి ఇదే చివరి అవకాశం ఉంటూ హెచ్చరించారు. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతర్‌తో పాటు ఇరాన్ కూడా దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని కోరడంతో ప్రణాళికలో ఉన్న సైనిక చర్యను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆయన తెలిపారు. ఇరాన్ అభ్యర్థన మేరకే చర్చలు జరుగుతున్నాయని, తొలి దశలో హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవడంపై చర్చిస్తున్నామని ట్రంప్ పేర్కొన్నారు. అనంతరం అణు నిరాయుధీకరణ అంశంపై చర్చలు కొనసాగుతాయని, ఇరాన్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలు ఉండనివ్వబోమని స్పష్టం చేశారు.

### ట్రంప్ వ్యాఖ్యలను ఖండించిన ఇరాన్

అయితే ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. అమెరికాతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి చర్చలు జరగడం లేదని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి స్పష్టం చేశారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయన్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు.

### 'హర్మూజ్‌లో ఇరాన్ అనుమతించిన మార్గమే అమల్లో ఉంటుంది'

మరోవైపు ఇరాన్ సుప్రీం లీడర్ సీనియర్ సైనిక సలహాదారుడు రెజాయీ స్పందిస్తూ, హర్మూజ్‌లో ఇరాన్ నిర్ణయించిన నౌకా మార్గం మినహా మరే అనధికార మార్గాన్నీ అనుమతించబోమని స్పష్టం చేశారు. అవసరమైతే అనుమతి లేకుండా ప్రవేశించే అమెరికా యుద్ధనౌకలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. ఇస్లామాబాద్ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) ప్రకారం హర్మూజ్‌కు సంబంధించిన ఇరాన్ ప్రతిపాదనలను అమెరికా మొదట అంగీకరించిందని, అనంతరం ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. వివాద పరిష్కార వ్యవస్థను ఆశ్రయించకుండానే అమెరికా సైనిక చర్యలకు దిగిందని పేర్కొన్నారు. అమెరికా ఒప్పందాన్ని ఉల్లంఘించిన తర్వాత 17 రోజులపాటు జరిగిన పోరాటంలో ఇరాన్ తీవ్ర ప్రతిఘటన చూపిందని తెలిపారు. తమ వద్ద అత్యాధునిక క్షిపణులు, దేశాన్ని రక్షించుకునే పూర్తి సామర్థ్యం ఉందని అమెరికాకు స్పష్టమైన సందేశం ఇచ్చామని అన్నారు. ఇరాన్ అనుమతి లేని మార్గంలో అమెరికా యుద్ధనౌకలు హోర్మూజ్ జలసంధిలోకి ప్రవేశిస్తే వాటిని లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు.

# బాంకీపుర్ తీర్పు బీజేపీకి బిగ్ వార్నింగ్

## సీఎంను మార్చాలనేదే ప్రజల సందేశం: ప్రశాంత్ కిశోర్



**టీ మీడియా, ఆగస్టు 4, ఢిల్లీ బ్యూరో :** జనసురాజ్ వ్యవస్థాపకుడు, బాంకీపుర్ ఉపఎన్నికలో విజయం సాధించిన ప్రశాంత్ కిశోర్ బీజేపీ, ఎన్‌డీఏ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బంకీపుర్ ఉపఎన్నిక ఫలితం బిహార్ ప్రజల తీర్పు మాత్రమే కాదని, రాష్ట్ర నాయకత్వంపై స్పష్టమైన సందేశమని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ వ్యవహారశైలి, వ్యక్తిత్వం, నాయకత్వాన్ని ప్రజలు అంగీకరించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం మార్చాలని ప్రజలు కోరడం లేదని, కానీ రాష్ట్రానికి మెరుగైన నాయకత్వాన్ని ఇవ్వాలని బీజేపీ కేంద్ర నాయకత్వానికి సంకేతం పంపారని పేర్కొన్నారు.

### కొత్తగాసమస్యలు రాలేదు

ఉపఎన్నిక ఫలితాల అనంతరం మంగళవారం మీడియాతో మాట్లాడిన ప్రశాంత్ కిశోర్, బిహార్‌లో ప్రస్తుతం చర్చలు నేరాలు, ఎన్‌కౌంటర్లు, కుల రాజకీయాల చుట్టూ తిరుగుతున్నాయని విమర్శించారు. ఇవన్నీ పక్కనపెట్టి విద్య, ఉపాధి, వలసల వంటి ప్రజలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. అధికారంలోకి వచ్చినప్పుడు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే బంకీపుర్ నియోజకవర్గంలో బీజేపీకి 51 వేలకుపైగా మెజార్టీ వచ్చిందని గుర్తుచేశారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో రోడ్లు దెబ్బతినలేదని, కొత్తగా ఎలాంటి సమస్యలు రాలేదని చెప్పారు. అయినప్పటికీ అదే ప్రజలు ఇప్పుడు బీజేపీని ఓడించారని పేర్కొన్నారు. ఈ మార్పుకు కారణం స్థానిక సమస్యలు కాదని, రాష్ట్రంలో బీజేపీ తీసుకొచ్చిన కొత్త నాయకత్వమేనని అన్నారు.

### 'బీజేపీకి పరాజయం ఎదురైంది అందుకే'

అయితే ప్రజలు తిరస్కరించింది బీజేపీ సిద్ధాంతాన్ని కాదని, ప్రస్తుతం రాష్ట్రానికి నాయకత్వం వహిస్తున్న వ్యక్తిని అని ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. ఆయన ప్రవర్తన, వ్యక్తిత్వం, ప్రజల్లో ఉన్న ఇమేజ్ అంగీకారయోగ్యంగా లేదని వ్యాఖ్యానించారు. అందుకే బంకీపుర్ ప్రజలు తమ ఓటు ద్వారా స్పష్టమైన సందేశం ఇచ్చారని చెప్పారు. మరోవైపు జంగిల్ రాజ్ అంశంపైనా ప్రశాంత్ కిశోర్ విమర్శలు గుప్పించారు. గతంలో జంగిల్ రాజ్‌కు వ్యతిరేకంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగిన బీజేపీ, అదే తరహా రాజకీయాలకు ప్రతీకగా భావించే వ్యక్తిని కాషాయ కండువా కప్పి ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోబెడితే ప్రజలు అంగీకరించరని వ్యాఖ్యానించారు. అందుకే బీజేపీకి పరాజయం ఎదురైందన్నారు.

### 'ప్రజా సమస్యలపై పోరాటం చేస్తే'

అయితే బిహార్‌లో ప్రభుత్వం మారబోతుందన్న ప్రచారాన్ని ప్రశాంత్ కిశోర్ ఖండించారు. ఎన్‌డీఏకి అసెంబ్లీలో స్పష్టమైన మెజార్టీ ఉందని, ఆ ప్రభుత్వం కొనసాగే అవకాశమే ఎక్కువగా ఉందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కూలే పరిస్థితి లేదని, కానీ ముఖ్యమంత్రి నాయకత్వంలో మార్పు రావచ్చని అభిప్రాయపడ్డారు. ప్రజల తీర్పు కూడా అదే దిశగా ఉందని చెప్పారు. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ భవిష్యత్తుపై కూడా స్పందించారు. ప్రస్తుతం ఆయన ప్రతిపక్ష నేతగా ఉన్నారని, వచ్చే నాలుగేళ్లలో ప్రతిపక్ష పాత్రను ఎంత సమర్థంగా పోషిస్తారన్న దానిపైనే ఆయన రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తే మరింత బలపడే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

### 'విద్యావంతుడైన నాయకుడిని సీఎంగా నియమిస్తేనే'

బాంకీపుర్ ఉపఎన్నిక ఫలితాన్ని బీజేపీ కేంద్ర నాయకత్వం సీరియస్‌గా తీసుకోవాలని ప్రశాంత్ కిశోర్ సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బిహార్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. రాష్ట్రానికి సమర్థుడైన, మంచి వ్యక్తిత్వం కలిగిన, విద్యావంతుడైన నాయకుడిని ముఖ్యమంత్రిగా నియమిస్తేనే బిహార్ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని అన్నారు. అప్పుడు రాష్ట్రంలో విద్య, ఉపాధి, యువత వలసలు వంటి ప్రధాన సమస్యలపైనే చర్చ జరుగుతుందని చెప్పారు. ఇటీవల ప్రశ్నాపత్రాల లీకేజీలు, నిరుద్యోగం వంటి అంశాలపై యువత చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో బంకీపుర్ ఉపఎన్నిక ఫలితం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. 1995 నుంచి బీజేపీ ఆధిపత్యంలో కొనసాగుతున్న బంకీపుర్ నియోజకవర్గం, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాజీనామాతో ఖాళీ కావడంతో ఉపఎన్నిక జరిగింది. ఆ ఎన్నికలో జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తన తొలి ఎన్నికల విజయాన్ని నమోదు చేశారు.

# పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల

● సీఎం చంద్రబాబు



**టీ మీడియా, ఆగస్టు 4, అమరావతి బ్యూరో :** రాష్ట్ర సమగ్ర సమాచారం ప్రజలకు తెలపడం ముఖ్యమని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు 2024 నాటి పరిస్థితులు, తాజా పరిస్థితులపై వాస్తవాలు ప్రజల ముందు పెట్టారు.

### రెండు రాష్ట్రాలు అభివృద్ధి చేశా

ప్రజలకు ఆర్థిక పరిస్థితిపై సమగ్ర సమాచారం చెబుతున్నట్లు సీఎం వివరించారు. ఇదొక చారిత్రక అంశమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ రిపోర్టులు ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం బాగా పని చేస్తుందనేందుకు భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం నిదర్శనమన్నారు. ప్రభుత్వం పనిచేస్తే ప్రజలు ఎలా స్పందిస్తారో అన్నదానికి భోగాపురం ఉదాహరణ అని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తు అనుసంధానానికి అంతర్జాతీయ గేట్‌వేగా తయారు చేశామన్నారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లో తెలుగు జాతి కోసం అభివృద్ధి చేశామని, రెండు రాష్ట్రాలు కూడా తానే అభివృద్ధి చేసినట్లు సీఎం పేర్కొన్నారు. పాలన బాగుంటే దాని ఫలితాలు ప్రజా జీవితంలో ప్రస్ఫుటం అవుతాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక బ్రాండ్ ఆంధ్ర పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నామన్నారు. ఉమ్మడి ఏపీలో తలసరి ఆదాయం రూ.95,231గా ఉండేదని, విభజన తర్వాత తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104, ఏపీలో తలసరి ఆదాయం రూ.93,903 అని వివరించారు. ఈ పరిస్థితుల నుంచి సీఏజీఆర్ 13.5 శాతం వృద్ధి స్థాయికి చేరామన్నారు. 2019–24 మధ్య జీఎస్‌డీపీ వృద్ధిరేటు 3.18 శాతం తగ్గిందని, వృద్ధిరేటు తగ్గడంతో రూ.6.94లక్షల కోట్ల నష్టం జరిగిందని సీఎం వివరించారు.

### పొదుపు చేశాం

వైఎస్సార్సీపీ పాలనలో నీతి ఆయోగ్ నివేదిక చూస్తే జరిగిన ఆర్థిక విధ్వంసం తేటతెల్లం అవుతోందని సీఎం అన్నారు. పెండింగ్ బిల్లులు రూ.48,616 కోట్లు ఉంటే దానిని రూ.29,259 కోట్లకు తగ్గించాగలిగామని సీఎం స్పష్టం చేశారు. 370లోన్లపై చర్చలు జరిపి 1100 కోట్లు ఆదా చెయ్యగలిగామని మెత్తంగా రూ. 8600 కోట్లు పొదుపు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులు ఉండేవని సీఎం అన్నారు.

# సమాధానాలు దాటవేస్తూ

## మోదీ, షా పార్లమెంటును అవమానిస్తున్నారు: ఖర్గే



**టీ మీడియా, ఆగస్టు 4, ఢిల్లీ బ్యూరో :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే. రామమందిర విరాళాల చోరీ, విద్యార్థులపై లాఠీఛార్జ్? అంశాలపై సమాధానాలు ఇవ్వడానికి భయపడి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఇలా చేస్తూ పార్లమెంటును అవమానిస్తున్నారని విమర్శించారు. వాస్తవాలు వెలుగులోకి రావాలంటే పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఈ రెండు అంశాలపై చర్చ జరగాలని ఖర్గే డిమాండ్ చేశారు.అయితే, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ఖర్గే కూడా ఈ విషయాన్ని సభలో లేవనెత్తినప్పటికీ, ఆయనకు మాట్లాడే అవకాశం లభించలేదు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు సంబంధించిన విలువైన కానుకలు, నగదు విరాళాలు, భూమి కొనుగోళ్లు, నిర్వహణలో నిధుల దుర్వినియోగంపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. "ఇది కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించిన విషయం. ఈ ట్రస్ట్ ఏర్పాటు కేంద్ర ప్రభుత్వంతోనే జరిగింది, దీనికి సంబంధించిన ప్రకటనను స్వయంగా ప్రధాని మోదీ సభలో చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ట్రస్ట్‌కు 70 ఎకరాలకు పైగా భూమిని అప్పగించింది. భూమి పూజ నుంచి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం వరకు ప్రతి ముఖ్యమైన సందర్భంలోనూ మోదీ స్వయంగా హాజరయ్యారు. ఇటువంటి పరిస్థితుల్లో, కానుకల చోరీతో సహా వచ్చిన తీవ్రమైన ఆరోపణల విషయంలో ప్రధాని బాధ్యత నుంచి తప్పించుకోలేరు. ఇప్పుడు ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ ఇతర దర్యాప్తు సంస్థలు ఎక్కడ ఉన్నాయో ఆయన సభకు చెప్పాలి. శ్రీరాముని పేరుతో దోచుకునే వారు దేశం మొత్తానికి క్షమాపణ చెప్పాలి. దేశాన్ని తప్పుదోవ పట్టించడం మానుకోవాలి." అని ఆయన అన్నారు. అనంతరం పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడిన ఖర్గే, సభ సజావుగా సాగేందుకు మోదీ, షా సభకు రావాలన్నదే తమ డిమాండ్? అని స్పష్టం చేశారు. "మేము ఈ అంశాలపై చర్చించాలని అనుకుంటున్నాము. ఉభయ సభల్లోనూ చర్చకు అనుమతించాలని మేము చైర్మన్, స్పీకర్‌ను కోరుతున్నాము. రామమందిర విరాళాల సొమ్ము అపహరణ, విద్యార్థులపై లాఠీఛార్జ్ గురించి చర్చిస్తే వాస్తవాలు వాటంతటవే బయటపడతాయి. కానీ ఏదో కారణం వల్ల ప్రభుత్వం భయాందోళనలకు గురైనట్లు కనిపిస్తోంది.

## రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి :బి ఆర్ ఎస్



**టీ మీడియా, ఆగస్టు 4, పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని సుభాష్ చౌరస్తాలో పెబ్బేరు వనపర్తి రోడ్డు విస్తరణలో వారికి మద్దతుగా పట్టణ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు స్థానిక సుభాష్ చౌరస్తాలో ధర్నా చేశారు ఈ సందర్బంగా మా ట్లాడుతూ ప్రభుత్వం ఇల్లు స్థలాలు పోగొట్టుకొని రోడ్డున పడ్డ కుటుంబాల వారికీ ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బి ఆర్ ఎస్ పార్టీ డిమాండ్ చేసింది బాధితులకు న్యాయం చేయాలనీ అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

## ఆనందం కోసం ప్రమాదం అంచుల్లోకి



**టి మీడియా, ఆగస్టు 4, ఆత్మకూర్ :**
వనపర్తి జిల్లా మరిచింత మండలం జూరాల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ వ్యూ పాయింట్ వద్ద భద్రతా ఏర్పాట్లపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో కొందరు యువకులు రక్షణ గోడపైకి ఎక్కి ప్రమాదకరంగా వ్యవహరిస్తున్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎలాంటి ప్రమాదం జరిగినా తీవ్ర పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో,ఈ ప్రాంతంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని అక్కడక్కడ పోలీసులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## పొంగిపొర్లుతున్న పుణ్యపువాగు నిలిచిన రాకపోకలు



**టీ మీడియా, ఆగస్టు 4, ఆళ్లపల్లి :**
టేకులపల్లి మండలం కూనవరం పరిధిలోని అనిశెట్టిపల్లి– మార్కోడు మార్గంలో పుణ్యపువాగు మహోగ్రరూపం దాల్చింది మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షాలకు వాగులోకి వరద నీరు భారీగా చేరడంతో కాజ్‌వే పైనుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి.నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులతో పాటు అత్యవసర వైద్య సేవలకు వెళ్లే బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**వంతెన లేక ఏటా అదే వ్యథ**

ఈ వాగుపై శాశ్వత వంతెన నిర్మించకపోవడం వల్లే ప్రతి వర్షాకాలంలోనూ తాము ఈ రకమైన నరకయాతన అనుభవించాల్సి వస్తోందని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ప్రజాప్రతినిధులు, అధికారులు హామీలు ఇవ్వడమే తప్ప సమస్యను పరిష్కరించడం లేదని ఆరోపిస్తున్నారు.పరిస్థితి తీవ్రత దృష్ట్యా అధికారులు అప్రమత్తమయ్యారు. వరద ఉధృతి తగ్గేవరకు ప్రజలు, వాహనదారులు అత్యవసరమైతే తప్ప వాగు దాటేందుకు ఎలాంటి సాహసాలు చేయవద్దని హెచ్చరించారు.

## జూరాల ప్రాజెక్టుకు జలకళ



**టీ మీడియా, ఆగస్టు 4 ,ఆత్మకూరు:**
ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు మహారాష్ట్ర కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద ప్రభావం రోజురోజుకు పెరుగుతూ కృష్ణమ్మ జలాలు గలగల అంటూ జూరాల ప్రాజెక్టులోకి ప్రవహించి శ్రీశైలం దిగువకు అధికారులు విడుదల చేస్తున్నారు.
30 గేట్లు ఎత్తి వేసీ, ఇన్ ఫ్లో: 2,30,000 క్యూసెక్కులు అవుట్ ఫ్లో: 2,34,629 క్యూసెక్కులు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516. మీటర్లు, ప్రస్తుత నీటిమట్టం..317.57 మీటర్లు, ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు.ప్రస్తుత నీటి సామర్థ్యం: 7,778 టీఎంసీలు.ఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో 11యూనిట్లలో 434 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తుంది.

## డాక్యుమెంట్స్ సక్రమంగా ఉండాలి



### ⏭ సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్

**టీ మీడియా,ఆగస్టు4,చింతూరు:**
ఆటోలు, మ్యాజిక్ లకు సంబంధించి అన్ని డాక్యుమెంట్స్ సి బుక్కు, ఇన్సూరెన్స్, ఫిట్నెస్ తదితర వాహనానికి రికార్డులు సక్రమంగా ఉండాలని లేనిచో కేసులు తప్పవని చింతూరు సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్ హెచ్చరించారు.ఈ మేరకు చట్టి, చింతూరు గ్రామాల్లో ఆటో, మేజిక్ యూనియన్ డ్రైవర్లు, యజమానులతో, అవగాహన కల్పించారు. వాహనాలు అధిక స్పీడుతో నడపరాదని, అలాగే పరిమితికి మించి ప్యాసింజర్ ఎక్కించకూడదని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోల్లో ప్రయాణిస్తున్న మహిళలను గౌరవించాలని ఉద్బోధించారు. ఆటోలు, మేజిక్ లు గాని రోడ్డుకు ఒక పక్కన వరుసక్రమంలో నిలుపుదల చేయాలని ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. డ్యూటీలో ఉన్నప్పుడు డ్రైవర్లు యూనిఫారం ధరించి, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ,ఎస్ఐ లతో పాటు ఆటో యూనియన్, నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

## కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**టీ మీడియా,ఆగస్ట్04,సింగరేణి(కారేపల్లి):**
ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పనితీరును సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.కేసుల దర్యాప్తును వేగవంతం చేసి,బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల విచారణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణ తీరును పరిశీలించిన ఆయన, ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీసింగ్‌ను తీర్చిదిద్దాలని అన్నారు.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించిన కమిషనర్, అనంతరం స్టేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశమై శాఖ పనితీరు మరింత మెరుగుపడేందుకు అవసరమైన పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఏసీపీ తిరుపతి రెడ్డి, కారేపల్లి సీఐ నూనావత్ సాగర్, ఎస్ఐ గోపితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డలకు తొలి రక్షణ పోషణ

**●జిల్లా మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్ట్ అధికారిణి ఏ. ప్రమీల**




**టీ మీడియా ఆగస్టు 4 కామేపల్లి:**
తల్లిపాలే బిడ్డలకు తొలి రక్షణ మరియు పౌష్టికాహారమని జిల్లా మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారిణి ఏ. ప్రమీల స్పష్టం చేశారు. ఐసిడిఎస్ కామేపల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని పండితాపురం రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పుట్టిన ప్రతి బిడ్డకూ అమ్మ పాలు అమృతంతో సమానమని ప్రమీల తెలిపారు. ప్రసవించిన వెంటనే వచ్చే ముర్రు పాలు బిడ్డకు అందే మొదటి సహజ సిద్ధమైన పౌష్టికాహారమని, దాన్ని ప్రతి తల్లీ తప్పక బిడ్డకు అందించాలని కోరారు. బిడ్డ పుట్టిన క్షణం నుండి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని, దీనివల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి అనారోగ్య సమస్యల నుండి రక్షణ లభిస్తుందని వివరించారు. ఆరు నెలల వయస్సు దాటిన తర్వాత తగిన పోషకాహారాన్ని అందిస్తూనే, రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని సూచించారు.తల్లిపాల వారోత్సవాలను కేవలం ఒక అధికారిక కార్యక్రమంగా మాత్రమే ముగించకుండా, గ్రామీణ ప్రాంత ప్రజల్లో పూర్తి స్థాయి చైతన్యం కలిగించేలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా తల్లులకు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై నిరంతరం అవగాహన కల్పిం చాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్య క్రమంలో కామేపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కే. ఉమా, మండల వైద్య అధికారిణి డాక్టర్ శ్రీదేవి, కొమ్మినేపల్లి సర్పంచ్ డి. అనురాధ, డీఎం కోఆర్డినేటర్ సమీన్‌లతో పాటు కామేపల్లి ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు టీ. విజయలక్ష్మి, పీ. లక్ష్మి, బి. వరలక్ష్మి, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరిస్తా

**● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా**



**టీ మీడియా, ఆగస్టు 4 కామేపల్లి:**
జిల్లాలోని గ్రంథాలయాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటికి త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపుతానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా స్పష్టం చేశారు. మంగళవారం ఆయన కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం, కామేపల్లి గ్రామాల్లో ఉన్న గ్రంథాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల నిర్వహణ, పుస్తకాల లభ్యత, పాఠకులకు అందుతున్న సేవలతో పాటు అక్కడ ఎదురవుతున్న పలు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**శిథిలావస్థలో పండితాపురం గ్రంథాలయం**

పండితాపురం గ్రంథాలయ సందర్శన సమయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు చైర్మన్‌కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం గ్రంథాలయం కొనసాగుతున్న భవనం పురాతన కాలం నాటిదని, తీవ్రంగా శిథిలావస్థకు చేరుకొని ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదకర స్థితిలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం విద్యార్థులు, పాఠకులు వచ్చే ఈ భవనంలో ప్రమాదాలు జరగకముందే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు.

**ప్రాథమిక పాఠశాలలోకి తాత్కాలిక మార్పుకు విజ్ఞప్తి**

నూతన భవన నిర్మాణం పూర్తయ్యే వరకు పాఠకులు, విద్యార్థుల సౌకర్యార్థం గ్రంథాలయ నిర్వహణను స్థానిక ప్రాథమిక పాఠశాల భవనంలోకి తాత్కాలికంగా మార్చేలా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. చైర్మన్‌కు వినతి పత్రం ఇచ్చిన కొమ్మినేపల్లి గ్రామ సర్పంచ్ అనురాధ,

**శాశ్వత పరిష్కారానికి కృషి: చైర్మన్ ఖాదర్ బాబా**

వినతిపత్రం స్వీకరించిన అనంతరం చైర్మన్ ఖాదర్ బాబా మాట్లాడుతూ... గ్రంథాలయ భవన పరిస్థితిని వెంటనే ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పాఠకుల భద్రత దృష్ట్యా తాత్కాలికంగా పాఠశాల భవనంలోకి మార్చే అంశాన్ని పరిశీలించడంతో పాటు, నూతన భవన ఏర్పాటుకు శాశ్వత పరిష్కా రం దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా కామేపల్లి గ్రంథా లయంలో ఉన్న మౌలిక వసతుల కొరతను కూడా త్వరలోనే నివారించి, గ్రంథాలయాలను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ గ్రంథపాలకుడు ఎం. నవీన్ కుమార్, స్థానిక గ్రామస్తులు, యువకులు, విద్యార్థులు, పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రిటైర్డ్ డిప్యూటీ తహసిల్దార్ మృతి



**టీ మీడియా, ఆగస్టు 4 ,కూసుమంచి:**
రిటైర్డ్ డిప్యూటీ తహసిల్దార్, కూసుమంచి మండలంలోని జుజ్జులరావుపేట మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నవీలే సుగుణ భర్త, నవీలే కొమరయ్య ( 75 ) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. సుమారు ఉదయం 6 గంటల సమయంలో టీ తాగేందుకు వేచి ఉన్న క్రమంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు కొమరయ్యకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. పలువురి నివాళులు : రిటైర్డ్ డిప్యూటీ తహసిల్దార్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సుగుణ భర్త నవీలే కొమరయ్య మరణ వార్త తెలిసిన పలువురు ఆయన స్వగ్రామం జుజ్జుల్ రావు పేట లో పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కూసుమంచి మండల మాజీ ఎంపీపీ బానోతు శ్రీను, నాయక్, మాజీ సర్పంచ్ చాట్ల పరశురాం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచర్ల జీవన్ రెడ్డి, జిల్లపల్లి ఉప్పయ్య, అలాగే జిల్లా భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు మళ్లీదు వెంకటేశ్వర రావు, కూసుమంచి మండల బి.ఆర్.ఎస్ అధ్యక్షులు వేముల వీరయ్య, ప్రధాన కార్యదర్శి ఎండి ఆసిఫ్ పాషా, జుజ్జులరావుపేట గ్రామపంచాయతీ సర్పంచ్ దాట్ల సతీష్ ( సలీం ), కూసుమంచి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బానోతు బిక్షం నాయక్ మాజీ సర్పంచ్ బానోతు కిషన్ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు వడిత్య బాలకృష్ణ, కాంగ్రెస్, బిఆర్ఎస్, పార్టీల నాయకులు, ఉప సర్పంచ్లు ,వార్డు సభ్యులు, కొమరయ్య పార్థివ దేహం వద్ద పుష్ప గుచ్చాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు వారు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కూసుమంచి మండలంలో ఉద్యోగ బాధ్యతలో కొమరయ్య ప్రజలకు చేసిన సేవలు ఎనలేనిమని ఈ సందర్భంగా వారు స్మరించారు. కొమరయ్య మృతి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారు భగవంతుని కోరుకున్నారు.

# కూటమి నాయకుల డోర్ టు డోర్ ప్రచారం



**టీ.మీడియా,ఆగస్టు4,చింతూరు:** ముకునూరు పంచాయతీ పరిధిలోని చూటూరు గ్రామంలోని 355వ బూత్‌లో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, గత రెండు సంవత్సరాల్లో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లిన టిడిపి, జనసేన నాయకులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వానికి ప్రజలు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇంచార్జ్ ఓబిళ్లనేని నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి మల్లెల వెంకటేశ్వరరావు, యూనిట్ ఇంచార్జ్ సీలం తమ్మయ్య, బూత్ ఇంచార్జ్ కారం సత్యవతి, జట్పాటి అంజి పాల్గొన్నారు. అలాగే జనసేన నాయకులు బేడే సతీష్, తీగల రవి, మల్లిపూడి సతీష్, పయ్యాల ప్రవీణ్, మిడియం రమణమ్మ, పోడియం నాగార్జున తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు.

# రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్‌గా తమ్మిశెట్టి శ్రీనివాస్ ఎంపిక

**టీ మీడియా,ఆగస్ట్04,సింగరేణి(కారేపల్లి):** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నూతన చరిత్ర పాఠ్యపుస్తకంపై రాష్ట్రవ్యాప్తంగా హిస్టరీ లెక్చరర్లకు శిక్షణ ఇచ్చేందుకు కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల చరిత్ర అధ్యాపకులు తమ్మిశెట్టి శ్రీనివాస్‌ను ఇంటర్మీడియట్ బోర్డు రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్‌గా ఎంపిక చేసింది.నూతన సిలబస్‌కు సంబంధించిన అంశాలపై హైదరాబాద్‌లోని ఇంటర్మీడియట్ బోర్డు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన హిస్టరీ లెక్చరర్లకు శిక్షణ అందించనున్నారు.తమ్మిశెట్టి శ్రీనివాస్ ప్రస్తుతం రాష్ట్రస్థాయి హిస్టరీ టెక్స్ట్‌బుక్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడిగా కూడా సేవలందిస్తున్నారు.విద్యారంగంలో ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగానే ఈ బాధ్యతలు లభించాయని అధ్యాపకులు పేర్కొన్నారు.తమ్మిశెట్టి శ్రీనివాస్ రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్‌గా ఎంపిక కావడం పట్ల కళాశాల



ప్రిన్సిపల్ ఎన్.విజయకుమారి,అధ్యాపక బృందం,విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

# ఓటరు జాబితా పారదర్శకంగా తయారు కావాలి

**▶▶| బీజేపీ నాయకుల పిలుపు**

**టీ.మీడియా,ఆగస్టు4,చింతూరు:** కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా రూపొందేందుకు బీజేపీకి చెందిన బీఎల్ఓ ఏజెంట్లు చురుకుగా పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సరోజిని స్వప్న కుమారి, జిల్లా అధ్యక్షుడు బుల్లి కొండల దొర పిలుపునిచ్చారు. మంగళవారం చింతూరులో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు బట్ట లక్ష్మణ్ రాజు అధ్యక్షతన నిర్వహించిన బీఎల్ఓ ఏజెంట్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాలంటే ఓటరు జాబితాలో ఉన్న దొంగ ఓట్లు, మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు



శాశ్వతంగా వెళ్లిపోయిన వారి ఓట్లను తొలగించడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చడం బీఎల్ఓల బాధ్యత అని పేర్కొన్నారు. ఓటరు జాబితా స్వచ్ఛంగా, తప్పులులేకుండా రూపొందించేందుకు ప్రతి బీఎల్ఓ ఏజెంట్ క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని, పార్టీ విజయానికి కృషి చేయాలని నాయకులు సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు పాయం వెంకయ్య, డీవీఎస్ఎన్ రమణారెడ్డి, మండల ముఖ్య నాయకులు, సీనియర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ సర్వే కు. రైతులు సహకరించాలి :తహసిల్దార్



**టీ మీడియా, ఆగస్టు 4 ,కూసుమంచి:** భూ సమస్యలు శాశ్విత పరిష్కారం అయ్యేందుకు, భూముల రీ సర్వే అయ్యేంతవరకు రైతులు ఓపికతో సహకరించాలని కూసుమంచి తహసీల్దార్ సైదులు కోరారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు భూ భారతి రీ సర్వే పై మంగళవారం మండలంలోని మల్లెపల్లి గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియ, భూ రికార్డుల సవరణ,హద్దుల నిర్ధారణ, రైతులు పాటించవలసిన విధివిధానాల గురించి క్లుప్తంగా వివరించారు. అనేక సంవత్సరాల నుండి ఉన్న భూ సమస్యల కు భూ భారతి ద్వారా శాశ్వత పరిష్కారం చేసేందుకు రైతులకు నూతన టెక్నాలజీ పద్ధతిలో భూముల రి సర్వే జరుగుతుందని ఆయన అన్నారు. గ్రామాలలో సాధారణంగా గట్టు ( సరిహద్దు ) తగాదాలు, క్రింది భూముల వ్యవసాయ సాగు చేయుటకు వెళ్లేందుకు పై గెట్టు భూములనుండి దారి వంటివి ప్రధాన సమస్యలుగా ఉంటున్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. మల్లెపల్లి గ్రామ సర్పంచ్ తెల్ల మేకల భవిత మాట్లాడుతూ నిజాం కాలం నుండి ఉన్నటువంటి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని, అందుకు రైతులు ఎంతో హర్షిస్తున్నట్లు అన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో గత సంవత్సరాలుగా ఉన్నటువంటి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేయడం అభినందనీయమని సర్పంచ్ భవిత మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లెపల్లి గ్రామ ఉపసర్పంచ్ తోటకూరి కృష్ణారావు, వార్డు సభ్యులు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాములు, సర్వేయర్ వెంకటేశ్వర్లు, జి పి ఓ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి బీఆర్ఎస్ నేత గౌసుద్దీన్ ఆర్థిక చేయూత

**టీ మీడియా, ఆగస్టు04, సింగరేణి(కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండల కేంద్రంలో గల అంబేద్కర్ కాలనీకి చెందిన చిలుముల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా,ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుడు షేక్ గౌసుద్దీన్ మంగళవారం ఆర్థిక చేయూత అందించారు.మృతుడి నివాసానికి వెళ్లిన గౌసుద్దీన్ కుటుంబ సభ్యులను పరామర్శించి,వారి దుఃఖంలో భాగస్వామ్యమయ్యారు. కుటుంబానికి ధైర్యం చెబుతూ రూ.5,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఇలాంటి క్లిష్ట సమయంలో పార్టీ తరఫున కుటుంబానికి అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డొంకెన



రవీందర్ గౌడ్,పాలిక వీరస్వామి,పేర్ని వెంకటేశ్వర్లు,చింతల సంపత్,ఎం.డి.ఖలీలుల్లా ఖాన్,సోమందుల వెంకటేశ్వర్లు, నాగరాజు,షేక్ అజారుద్దీన్,తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ పనులు



**టీ మీడియా ,ఆగస్టు 4 ,ఆళ్లపల్లి:** ప్రజారోగ్యం, గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముందుకుసాగుతున్న మార్కోడు గ్రామ పంచాయతీలి మార్కోడు సమీపంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గ్రామంలో ఎక్కడా వర్షపు నీరు నిలిచిపోకుండా మార్కోడు గ్రామ పంచాయతీ యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టింది. సర్పంచ్ సుతారి రమాదేవి గారు, ఉప సర్పంచ్ వగలబోయిన సతీష్ గారు సెక్రెటరీ రాధాకృష్ణ గారు సుతారి కృష్ణ దగ్గరుండి యుద్ధప్రాతిపదికన సైడ్ డ్రైనేజీ పనులను, మురుగుకాలువల క్లీనింగ్ పనులను నిర్వహించారు.వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి, నీరు సరళంగా ప్రవహించేలా ఏర్పాటు చేశారువర్షాకాలంలో గ్రామస్తులకు ఎలాంటి అంటువ్యాధులువ్యాపించకుండా, రోడ్లపై నీరు నిలవకుండా ఉండేందుకు మార్కోడు గ్రామంలో ముందస్తు చర్యలు చేపట్టారు.

# ప్రయాణికుల భద్రతపై దృష్టి పెట్టాలి

**▶▶| ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**

**టీ మీడియా, ఆగస్టు 4, హైదరాబాద్ బ్యూరో :** విమానాలలో క్రమశిక్షణ, ప్రయాణికుల భద్రత, ప్రయాణికులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో ప్రశ్నించారు. ఇందుకు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ స్పందిస్తూ..విమానాలు, ప్రయాణీకులు, ఆస్తుల భద్రతను నిర్ధారించడం, విమానాల్లో క్రమశిక్షణ తదితర అంశాలకు సంబంధించి ప్రత్యేక విభాగాలతో పాటు స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని పేర్కొన్నారు.

విమానాలలో క్రమశిక్షణ, ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా అవాంఛనీయ లేదా అల్లరి ప్రవర్తనను నియంత్రించేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్



సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్, సెక్షన్–3, ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్, సిరీస్–ఎం, పార్ట్–6 కింద 'హ్యాండ్లింగ్ ఆఫ్ అన్‌రూలీ,డిస్‌రప్టివ్ ప్యాసింజర్స్' పేరుతో ప్రత్యేక మార్గదర్శకాలు ఉన్నాయని ఎంపీ రవిచంద్రకు మంత్రి మొహోల్ తెలిపారు. ప్రత్యేక అవసరాలున్న ప్రయాణికుల కోసం క్యాబిన్ సేఫ్టీ సర్క్యులర్–01/2016 ప్రకారం మార్గదర్శకాలు అమలులో ఉన్నాయని మంత్రి బదులిచ్చారు.

అలాగే, ప్రయాణీకుల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించేందుకు గాను తమ శాఖ 24 గంటల 'ప్యాసింజర్ అసిస్టెన్స్' కంట్రోల్ రూమ్‌ను అనుసంధానం చేసి విమానాల రాకపోకల సమయం, సామాన్ల భద్రత, వాటి చేరవేతలో తలెత్తిన సమస్యలు, రీఫండ్ అంశాలను డీజీసీఏ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విమానయాన సంస్థలతో సమన్వయం చేస్తూ పర్యవేక్షిస్తున్నట్లు ఎంపీ రవిచంద్రకు ఇచ్చిన సమాధానంలో మంత్రి ఎ ల్లడించారు. అదనంగా, ప్రయాణికుల ఫిర్యాదుల సత్వర పరిష్కారం కోసం ఎయిర్ సేవా పోర్టల్, మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి మొహోల్ ఎంపీ వద్దిరాజుకు ఇచ్చిన సమాధానంలో వివరించారు.

# లిఫ్ట్‌లో ఇరుక్కుని మహిళ మృతి

**టీ మీడియా, ఆగస్టు 4, హైదరాబాద్ బ్యూరో:** అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్లో లిఫ్ట్ వద్దకు చేరుకున్న అనంతరం శ్రీనివాస్ ముందుగా లిఫ్ట్‌లోకి ప్రవేశించగా, అనసూయ లిఫ్ట్‌లోకి ఎక్కుతున్న సమయంలో ఒక కాలు లోపల, మరో కాలు బయట ఉండగానే లిఫ్ట్ తలుపులు పూర్తిగా మూసుకోకముందే అకస్మాత్తుగా పైకి



కదిలింది. దీంతో ఆమె లిఫ్ట్, ప్రవేశ ద్వారం మధ్య ఇరుక్కుపోయి తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. భర్త శ్రీనివాస్ కేకలు వేయడంతో అపార్ట్‌మెంట్ వాసులు, స్థానికులు అక్కడికి చేరుకుని లిఫ్ట్‌ను నిలిపేసి అనసూయను బయటకు తీశారు.ఆమెను వెంటనే చందానగర్‌లోని ప్రైవేట్ దవఖానాకు తరలించగా పరీక్షించిన వైద్యులు అనసూయ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా ప్రమాదం జరిగిన సమయంలో లిఫ్ట్ మరమ్మత్తు పనులు జరుగుతున్నప్పటికీ, లిఫ్ట్ టెక్నీషియన్ అనిల్ కుమార్ ప్రధాన విద్యుత్ సరఫరాను నిలిపివేయకుండా, నివాసితులను అప్రమత్తం చేసేలా ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకుండా పనులు నిర్వహించాడని అనసూయ భర్త ఆరోపించారు.లిఫ్ట్ టెక్నీషియన్ నిర్లక్ష్యంతో పాటు అపార్ట్ మెంట్ అసోసియేషన్ సభ్యులు, లిఫ్ట్ నిర్వహణ సంస్థ జాన్సన్ ఎలివేటర్స్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తన భార్య మృతి చెందిందని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సిగ్నల్ లైట్సా.. బర్త్ డే పోల్సా ?

**▶▶| ఇష్టానుసారంగా నాయకుడి ఫ్లెక్సీలు**

**▶▶| పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు**

**టీ మీడియా, ఆగస్ట్ 4, కొత్తగూడెం :** జిల్లా కేంద్రంలో పరిపాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. ప్రభుత్వ ఆస్తులు రాజకీయ నాయకుల పుట్టినరోజు ప్రచారాలకు వేదికగా మారుతున్నా పట్టించుకునే నాధులే కరువయ్యారు. కొత్తగూడెం నగరంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుడు తన పుట్టినరోజు ఫ్లెక్సీలను ఏకంగా ట్రాఫిక్ సిగ్నల్ లైట్ పోల్స్ కి, విద్యుత్ స్తంభాలకు కట్టడం వివాదాస్పదంగా మారింది. పుట్టినరోజు ముగిసినప్పటికీ ఇంకా ఆ ఫ్లెక్సీలు తొలగించకపోవడంపై ఇటు కార్పొరేషన్ అధికారులు, అటు పోలీస్ అధికారులపై తీవ్ర విమర్శలు



వెల్లువెత్తుతున్నాయి. సదరు నాయకుడు తన ఫ్లెక్సీలను ట్రాఫిక్ కి అంతరాయం కలిగించే విధంగా ఇష్టానుసారంగా కట్టించినప్పటికీ వాటిని తొలగించడంలో అధికారులు అలసత్వం వహించడం శోచనీయం. మరీ ముఖ్యంగా పోస్ట్ ఆఫీస్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ సైతం రాజకీయ నాయకులు, ఇతరులు ఇష్టానుసారంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం పరిపాటిగా మారింది.జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం ప్రాంతం కార్పొరేషన్ గా ఏర్పడినప్పటికీ అభివృద్ధి మాట పక్కన పెడితే, నగరంలో అడ్డు అదుపు లేకుండా ట్రాఫిక్ కి అంతరాయం కలిగించే విధంగా విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాట్లు చేయడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా రోడ్లు, డివైడర్ల పై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకోకుండా, ఫ్లెక్సీలను నియంత్రించకుండా వదిలేయడం సరైన విధానం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి ఫ్లెక్సీలను తొలగించి, ఇకపై ఎవరు కూడా ఇలాంటి వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా హెచ్చరికలు జారీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# బెజవాడ దుర్గమ్మ గుడిలో భద్రతా వైఫల్యం

### ⏭ రీల్స్, టికెట్ల దందాకు కేరాఫ్

**టీ మీడియా, ఆగస్ట్ 4, విజయవాడ :**
ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో భద్రతా వైఫల్యాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. నిత్యం వేలాది మంది భక్తులతో రద్దీగా ఉండే దుర్గగుడిలో ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భక్తులతో మర్యాదగా వ్యవహరించే తీరు దగ్గరి నుంచి, ఆలయ పవిత్రత కాపాడే విషయంలో వారు ఘోరంగా విఫలమవుతున్నారు. టికెట్ల రీసైక్లింగ్ దందా నుంచి మొబైల్ ఫోన్ల అనుమతి వరకు ప్రతి చోటా భద్రతా సిబ్బంది వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది.



దుర్గమ్మ దర్శనానికి ప్రతిరోజూ 30 వేల నుంచి 50 వేల మంది భక్తులు వస్తుంటారు. వారాంతాలు, పండగలు, సెలవు దినాల్లో ఈ సంఖ్య అమాంతం పెరిగిపోయి 70 వేల నుంచి లక్షకు చేరుకుంటుంది. ఇంత పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులను నియంత్రించడానికి సిబ్బందికి సరైన శిక్షణ ఉండాలి. ప్రధాన ఆలయం, క్యూలైన్లు, ప్రవేశద్వారాలు, కనకదుర్గానగర్, ఘాట్ రోడ్డు వంటి కీలక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టంగా ఉండాలి. కానీ, కాంట్రాక్టు సంస్థ ఎవరిని పడితే వారిని తీసుకొచ్చి యూనిఫాం వేసి విధుల్లోకి దించుతోందన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. కనీస శిక్షణ లేకపోవడంతో వారు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**డబుల్ డ్యూటీలు**

సెక్యూరిటీ గార్డుల పనితీరుపై నిత్యం ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. తమకు కేటాయించిన అసలు విధులు పక్కనపెట్టి ఇతర పనుల్లో వారు తలమునకలవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. సిబ్బంది కొరత సాకుతో ఒకే వ్యక్తికి 16 గంటల పాటు డబుల్ డ్యూటీలు వేస్తున్నారు. దీంతో వారు తీవ్ర అలసటకు గురై విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. భక్తులతో చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. వీటన్నింటికి మించి, దర్శన టికెట్ల రీసైక్లింగ్ లోనూ వీరి పాత్ర ప్రధానంగా ఉంటోంది. కొందరిని ఏళ్ల తరబడి ఒకేచోట విధుల్లో ఉంచడమే ఈ అక్రమాలకు ప్రధాన కారణమని తెలుస్తోంది.

**సెల్ ఫోన్లతో రీల్స్**

ఆలయ ప్రాంగణంలోకి మొబైల్ ఫోన్లను అనుమతించకూడదన్న కఠిన నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని విచ్చలవిడిగా అనుమతిస్తున్నారు. భక్తులు ఫోన్లతో వచ్చి ఫోటోలు, వీడియోలు తీసుకుంటున్నా సిబ్బంది కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. ఇటీవల రాజగోపురం ఎదురుగా ఒక యువతి నేరుగా సెల్ ఫోన్ తీసుకొచ్చి నృత్యం చేస్తూ రీల్స్ చేసింది. ఆలయంలో కీలకమైన ఆ ప్రాంతంలో భద్రతను పర్యవేక్షించాల్సిన ఒక్క సెక్యూరిటీ గార్డు కూడా ఆమెను ఆపే ప్రయత్నం చేయలేదు. గుడికి సంబంధించిన పవిత్రతను కాపాడాల్సిన వారే ఇలా చోద్యం చూస్తుండటం అందరినీ విస్మయానికి గురిచేసింది.

**స్పందించిన ఈవో**

రాజగోపురం వద్ద యువతి రీల్స్ చేసిన ఘటన, సెక్యూరిటీ సిబ్బంది వైఫల్యాలపై 'ఈనాడు' పత్రికలో సోమవారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై ఆలయ ఈవో వి.కె.శీనానాయక్ స్పందించారు. భద్రతా బాధ్యతలు చూస్తున్న గుత్తేదారు సంస్థ 'ఎజైల్ సెక్యూరిటీ ఏజెన్సీ'కి సోమవారం వెంటనే నోటీసులు జారీ చేశారు. ఇకపై సిబ్బందితో డబుల్ డ్యూటీలు ఎట్టి పరిస్థితుల్లోనూ చేయించకూడదని కఠిన ఆదేశాలు జారీ చేశారు.

**కొత్త టెండర్లకు సన్నాహాలు**

ప్రస్తుతం ఉన్న సెక్యూరిటీ ఏజెన్సీ టెండర్ గడువు ఇప్పటికే ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో భద్రతా వ్యవస్థను ప్రక్షాళన చేయాలని అధికారులు భావిస్తున్నారు. కొత్తగా మళ్లీ టెండర్లు పిలవాలని ఆలయ ధర్మకర్తల మండలి ఇటీవల తీర్మానించింది. కొత్త టెండర్ల అనుమతి కోరుతూ దేవాదాయ శాఖకు ఇప్పటికే నివేదిక పంపించారు. దీనిపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు మరోసారి లేఖ రాస్తామని ఈవో శీనానాయక్ స్పష్టం చేశారు.

# కడప యువకుడి రికార్డ్

### ⏭ ఒకే ఏడాదిలో 13 కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు

**టీ మీడియా, ఆగస్ట్ 4, కడప :**
సర్కార్ ఉద్యోగం సాధించాలన్నది ఎంతో మంది కల. ఒక్క ప్రభుత్వ కొలువు సాధిస్తే జీవితం సెటిల్ అవుతుందని చాలా మంది భావిస్తుంటారు. ఇందుకోసం రేయింబవళ్లు కష్టపడుతుంటారు. అయినా విజయం వరిస్తుందని కచ్చితంగా చెప్పలేం. కానీ ఈ యువకుడు మాత్రం పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాడు. తాను పెట్టుకున్న లక్ష్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి అందుకనుగుణంగానే ఎక్కడా ఏమరపాటుకు తావులేకుండా అనుకున్న లక్ష్యం వైపు పయనం సాగించాడు.



తల్లిదండ్రులను స్ఫూర్తిగా తీసుకొని సర్కార్ కొలువు సాధించే వరకు విశ్రమించేదే లేదని పట్టుబట్టాడు ఈ యువకుడు. దీంతో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం రావడమే కష్టమవుతున్న ఈ తరుణంలో ఒకే సంవత్సరంలో 13 కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. మరి ఇదంతా తనకెలా సాధ్యమైంది? అతని విజయ రహస్యం ఏంటో తన మాటల్లోనే తెలుసుకుందామా?

'నా పేరు లొమడ నాగేంద్ర సాయి. మేం ఉండేది కడప టౌన్‌లోనే. నాన్న అశ్వనీకుమార్ ఏపీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి కాగా అమ్మ రాజరాజేశ్వరి ప్రభుత్వ టీచర్. ఒకటి నుంచి 10వ తరగతి వరకూ కడపలో చదివాను. పది ఫలితాల్లో 9.7 జీపీఏ వచ్చింది. హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ (ఎంపీసీ) పూర్తి చేశాను, 974 మార్కులు సాధించాను. ఆ తర్వాత జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు రావడంతో ఖరగ్‌పూర్ ఐఐటీలో ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సు (బీటెక్+ఎంటెక్)లో చేరాను. ఆ సమయంలో సాఫ్ట్‌వేర్ జాబ్, మంచి ప్యాకేజీ సాధించాలన్నదే నా లక్ష్యం.

2019 అక్టోబర్‌లో అకడమిక్ పూర్తి చేశాను. అప్పుడు సాఫ్ట్‌వేర్ జాబ్ కోసం అన్వేషణ ప్రారంభించాను. ఆ సమయంలోనే కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించింది. ఈ నేపథ్యంలో ఐటీ రంగం సంక్షోభంలో పడింది. కంపెనీలు ఉద్యోగులకు లేఆఫ్స్ ఇవ్వడం, సమాచారం లేకుండా జాబ్? నుంచి తొలగించడం వంటివి జరిగాయి. ఆ సమయంలో ప్రైవేట్ రంగంలో ఉద్యోగ భద్రత తక్కువని గ్రహించాను. దీంతో సాఫ్ట్‌వేర్ రంగంపై ఆశ వదులుకున్నాను. నా తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో వారిని స్ఫూర్తిగా తీసుకుని 2022 నుంచి సర్కార్ కొలువులకు ఇంటి దగ్గరే ప్రిపేర్ అయ్యాను.

2023లో దాదాపు ఐదు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్షలు రాశాను. ఒక్కటీ రాలేదు. అప్పుడే అర్థమైంది, ఇప్పుడున్న సన్నద్ధత సరిపోదని. దీంతో 2024లో హైదరాబాద్‌కు వెళ్లి ఆరు నెలలపాటు కోచింగ్ తీసుకున్నాను. ఆ తర్వాత అక్కడే ఉండి ప్రిపేర్ అయ్యాను. ఈ నేపథ్యంలో ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్ష రాశాను. 'కీ' చూశాక మార్కులు బాగా రావడంతో జాబ్? ఖాయమని అనిపించింది. నా తల్లిదండ్రులకు అదే చెప్పాను. కానీ ఒకే ఉద్యోగానికి అప్లై చేయడం, నార్మలైజేషన్ ప్రక్రియతో మార్కులు తగ్గడంతో త్రుటిలో పోస్ట్ చేజారింది. అప్పుడు చాలా బాధపడ్డాను. అయినా మళ్లీ లోపాలను సరిదిద్దుకుని ఎగ్జామ్స్?కు ప్రిపేర్ అయ్యాను.

2025లో విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు అన్నింటికీ అప్లై చేశాను. రోజుకు 12 గంటల నుంచి 14 గంటల వరకు చదివాను. ఎప్పుడైనా ఆత్మవిశ్వాసం తగ్గితే సెల్ఫ్ మోటివేషన్, పాజిటివ్ రీల్స్ చూస్తూ ఉండేవాడిని. అనంతరం ఫలితాల్లో సంవత్సరంలో వరుసగా 13 కేంద్ర ప్రభుత్వ కొలువులు వరించాయి. వచ్చిన వాటిల్లో బాగా నచ్చింది తీసుకున్నాను. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాలో ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ)లో సోషల్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఎస్ఎస్‌వో)గా విధులు నిర్వహిస్తున్నాను. నాపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడం గర్వంగా ఉందని' లొమడ నాగేంద్ర సాయి తెలిపారు. సరస్వతీ పుత్రుడిగా కుమారుడు సాధిస్తున్న విజయాలను చూసి తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

# స్వయంకృషితో సాఫ్ట్‌వేర్ కంపెనీకి సీఈఓ

### ⏭ కారు డ్రైవర్ కుమారుడి సక్సెస్ స్టోరీ

**టీ మీడియా, ఆగస్ట్ 4, హైదరాబాద్ బ్యూరో :**
కారు డ్రైవర్ కుమారుడుకు పట్టుదలతో స్వయం కృషిపై ఎదిగారు. సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించి చీఫ్? ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్? అయ్యారు. తండ్రి నుంచి చదువు విలువ తెలుసుకున్న ఆయన చాలామందికి ఉపాధి కల్పించే ఉన్నత స్థాయికి ఎదిగారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైమ్ టైకూన్ మీడియా సంస్థ తెలంగాణ గ్లోబల్ ఎలైట్–2026 అవార్డులను ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్?లో ప్రదానం చేసింది. ఉత్తమ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కంపెనీ ఆఫ్ ద ఇయర్ అవార్డును దక్కించుకోవడంతో రాము టాలెంట్ ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది.



**అమెరికా టూ హైదరాబాద్**

కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన కుంజా రాఘవులు ఐటీడీఏ పీఓ రాహుల్ వద్ద కారు డ్రైవర్‌గా డ్యూటీ చేస్తున్నారు. ఈయన కుమారుడు రాము ప్రైమరీ చదువు భద్రాచలం, సమీపంలోని పాల్వంచలో పూర్తి చేశారు. సత్తుపల్లిలో ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేశారు. రాము తొలినాళ్లలో అమెరికాలో ఉద్యోగం చేశారు. కొన్ని రోజుల అనంతరం హైదరాబాద్ తిరిగి వచ్చి వేరే సంస్థలో పని చేస్తూ 2016లో రూ.50 లక్షల పెట్టుబడితో ఈ-కార్ట్ సాఫ్ట్ లాబ్స్ ఐటీ, సాఫ్ట్‌వేర్ అనే కంపెనీని స్థాపించారు. అంకుర సంస్థలు, చిన్న, మధ్య తరహా స్టార్టప్?లు ఎదుర్కొంటున్న వ్యాపార సమస్యలను లోతుగా విశ్లేషణ చేసి వాటికి అత్యాధునిక టెక్నాలజీ పరిష్కారం చూపారు. సంస్థ వార్షిక లావాదేవీలు ఇప్పటివరకు సుమారు రూ.10 కోట్ల వరకు ఉంటాయి. ఈ-కార్ట్ సాఫ్ట్ లాబ్స్ సంస్థలో 15 మంది వరకు ఉపాధి అవకాశాలు పొందారు.

**అన్నదాతలకు ఏఐతో సహకారం**

కొవిడ్ విజృంభనకు జనాల్లో చాలా మార్పులు సంభవించాయి. తర్వాత ప్రజల్లో ఎక్కువ శాతం ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. నాణ్యమైన ఉత్పత్తులు ఎక్కడ ఉన్నాయో వివరించేందుకు ఆగ్రోస్ నెక్సస్ పేరుతో ఏఐ బేస్డ్ అగ్రి టెక్ ఎకో సిస్టంను రాము అందుబాటులోకి తీసుకొచ్చారు. పంటలు మధ్యలో దళారీలు లేకుండా నేరుగా కొనుగోలు చేయొచ్చు. ఎంత ధాన్యం కావాలో చెప్పి ముందుగానే రైతు ఖాతాలో నగదు జమ చేయిస్తున్నారు. పంట పండిన తర్వాత ఉత్పత్తులను కొనుగోలు చేసిన వారు వచ్చి తీసుకుంటారు.

**బెస్ట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కంపెనీ ఆఫ్ ది ఇయర్**

ఇంతింతై వటుడింతై అన్నట్లు ఈ కార్ట్ సాఫ్ట్ ల్యాబ్స్ సంస్థ అభివృద్ధి బాటలో పరుగులు పెడుతోంది. నాయకత్వ పటిమ, డిజిటల్ విప్లవం, మోడ్రన్ టెక్నాలజీ సొల్యూషన్స్ చూపినందుకు బెస్ట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కంపెనీ ఆఫ్ ది ఇయర్ అవార్డు ఈ-కార్ట్ సాఫ్ట్ లాబ్స్‌కు దక్కింది. ప్రముఖ సినీ నటి ఆదాశర్మ చేతుల మీదుగా సీఈఓ రాముకు అవార్డును అందజేశారు. ఈ అవార్డు తనలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని రాము తెలిపారు.

# 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు

### ⏭ రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు

**టీ మీడియా, ఆగస్టు 4, హైదరాబాద్ బ్యూరో :**
ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన చేయనున్నారు. యూకే, అమెరికా, జర్మనీ, చైనా వెళ్లనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు విదేశీ పర్యటనలకు వెళ్లనున్నారు.

**రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో సీఎం భేటీ కానున్నారు. దీంతోపాటు పలువురు కేంద్ర మంత్రులను కూడా కలిసే అవకాశం ఉంది.



# టీటీడీ అగరబత్తీల కాంబో ప్యాక్ ధర రూ.452




### ⏭ ఈ-కామర్స్ సైట్లలో రూ.1035

### ⏭ అక్రమార్కుల దోపిడీ

**టీ మీడియా, ఆగస్టు 4, అమరావతి బ్యూరో :**
టీటీడీ ఉత్పత్తులు, వాటిని పోలిన నకిలీ ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో అంగడి సరకులుగా మారిపోతున్నాయి. భక్తుల ఆదరణకు అనుగుణంగా టీటీడీ విభిన్న పరిమళాలతో అగరబత్తులను తయారు చేయించి విక్రయిస్తోంది. కొందరు అక్రమార్కులు వాటిని ఈ–కామర్స్ సైట్లలో ఉంచి రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారు. అగరబత్తులతోపాటు ఓ చిన్నపాటి వస్తువును ఉంచి భారీ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉదాహరణకు టీటీడీ అగరబత్తి కాంబో ప్యాక్ ధర టీటీడీ విక్రయించేది రూ.452.38 కాగా ఆన్‌లైన్లో రూ.1035 నుంచి రూ.1049 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది.

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని ఆలయాల్లో స్వామివారి అలంకరణకు, పూజకు వినియోగించే పుష్పాలను వినియోగిస్తూ సుగంధ పరిమళాలు వెదజల్లే అగరబత్తులను తయారు చేస్తోంది. వీటి తయారీలో వివిధ పరిమాణాలు ఉంటాయి. ఇవన్నీ సిద్ధం చేశాక తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో వీటిని విక్రయిస్తారు.

**ఈ ఆలయాల్లోనే విక్రయాలు**

తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం,తిరుపతిలోని రాములవారి ఆలయం,శ్రీ కోదండరామస్వామి ఆలయం, గోవిందరాజస్వామి ఆలయం, కపిలేశ్వర ఆలయం, శ్రీనివాసమంగాపురం, అప్పలాయగుంట, సహా నారాయణవనంలోని టీటీడీ ప్రముఖ ఆలయాల వద్ద వాటిని విక్రయిస్తుంటారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్?తో కలిపి నెలకు రూ. కోటి వరకు విక్రయాలు జరుగుతున్నట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి.

తిరుమల తిరుపతి దేవస్థానం గతంలో కొన్ని ఈ–కామర్స్ సంస్థలకు క్యాలెండర్లు, డైరీల విక్రయానికి అనుమతులు ఇచ్చిన సంగతి తెలిసిందే. కానీ అప్పుడు అగరబత్తులకు ఆ అనుమతులు ఇవ్వలేదు. ప్రస్తుతం టీటీడీ అనుమతి లేకుండానే కొన్ని సంస్థలు భారీ స్థాయిలో అగరబత్తులను సేకరించి విక్రయించడంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

**అదీ నేరమే**

అనుమతి లేకుండా టీటీడీ లేబుళ్లను వినియోగించడం కూడా నేరమే. నిబంధనలకు విరుద్ధంగా టీటీడీ పేరుతో అగరబత్తులను సరఫరా చేసేవారిపైన విచారణ జరిపి భక్తులను ఈ–కామర్స్ సంస్థల దోపిడీ నుంచి కాపాడాలని కోరుతున్నారు. రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి గతంలో లేబుళ్లు సిద్ధం చేసి విక్రయిస్తుండగా విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ రేణుదీక్షిత్ తెలిపారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

# పకడ్బందీగా పోలీస్ ఉద్యోగ నియామకాలు



### ⏭ పరీక్షల నిర్వహణపై ప్రత్యేక నిఘా

### ⏭ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

**టీ మీడియా, ఆగస్ట్ 4, హైదరాబాద్ బ్యూరో:**
పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7437 పోస్టుల భర్తీ ప్రక్రియపై నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు పోలీస్ ఉన్నతాధికారులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్ కు సంబంధించి నియామక ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పాదర్శకంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. నియమ నిబంధనలను అనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు అన్ని ప్రక్రియలలో అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా కోచింగ్ సెంటర్స్ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. నియామక పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్ సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటలీజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ అత్యవసర సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు..

